ప్రేయసి మరణించిందని చెప్పిన అబద్ధానికి ఆమె ప్రియుడు ఏమయ్యాడు?

# రేయి రాలిన పువ్వు

గంటి రమాదేవి కథ

ఎప్పుడో మొదలయింది వాన... చినుకుగా... చినుకుగా,... చిరాగ్గా... పగటికీ రాత్రికీ తేడా తెలియడంలేదు. ఏదో చిన్న చిరువెలుగులు తప్ప...

చూరుమీదనుంచి నీటి బిందువుల నిరంతర శబ్దం... అలవాటైన ఆ శబ్దం నిశ్శబ్దంతో సమానమే...

చీకట్లోకి చూసాడు రవి... ఏముందక్కడ? కనపడని వాన తప్ప...

"రూపా... రూపా..." మౌనంగా రోదించే ఆ మనస్సుకు చెదిరిన జ్ఞాపకాలే ఊపిరి... తదనంతరం బరువైన బాధ...

చెరువుదగ్గర చూశాడు రూప రూపాన్ని మొదట. నీటిలో అందాలు చూసుకునే మందార పువ్వులా. గాలికి చెదిరే అలల తాకిడికి చెట్లనీడలు పాముల్లా చెరువుల్లా పాకుతున్నప్పుడు... నుదుట బొట్టు పెట్టుకోవాలని, గట్టునున్న ముద్ద మందారం నీటిలో కొంగినప్పుడు — దగ్గరగా చూశాడు రూపని.

పూలమొక్కలమీద తొణికిసలాడే చినుకు తుంపర ముత్యంవలె స్వచ్ఛంగా నవ్వింది.

పిల్లకాలవ గట్టుమీద నడుస్తూ, నేలమీద అక్కడక్కడా పరిచిన నిప్పు కణికెల్లాంటి ఆరుద్ర పురుగులు తన్మయత్వంతో చూస్తుంటే కాలుజారబోతే — రవి బలమైన చేతులే బురదలో జారకుండా రూపని కాపాడాయి.

"దూదిపింజలవంటి మేఘమాలల్ని చంద్రుడు నీలిమందు పెట్టి ఉతికి, ఆరేసినట్టుంది" అన్నప్పుడు రూప మాటలకు రవి పక్కున నవ్వాడు.



"గోమాత ఇచ్చిన తెల్లటి పాల పెరుగుల్లో, వెన్నముద్దలా లేదూ, దూదిపింజల్లో చంద్రుడంటే బాగుంటుంది'' అన్నాడు.

నీరెండలో పచ్చని పచ్చిక మైదానాల్లో, చిరుచీకటి తన వల్లె వాటును కప్పుతున్న సమయాల్లో — పరిగపిట్టలోపాటు కూత కూసి, మంచుముత్యాల చలిగాల్లో — వెచ్చగా వణికి, గ్రీష్మపుటెండల్లో గిరెత్తిపో

యి, సిరిమల్లెల చల్లదనంతో, సేదదీరి, ఒక సంవత్సరం — మధురంగా — అందంగా ఆనందంగా గడిపేశారు ఇద్దరూ.

ప్రతీ అందానికి వెనక విషాదం వుంది.

ప్రతీ ఆనందానికి — ఆ వెనక ఇవ్వలేని వెల వుంది...

ప్రతీ ప్రేమకు — ఆ వెనక కాలనాగు కాచుకు కూచుంటుంది — కాటువెయ్యాలని...

ఇది నిశ్చయం — తప్పదు — పగలూ రాత్రిలా—

పంటకళ్లాలలో 'పండు' ధాన్యరాసులు బండ్లకెక్కించే సమయం. బంతిపూలూ, చేమంతి పూలు కలిపి ఆడే సంక్రాంతివేళ. లేగటి పాలతో కాగి మాగిన తీయతీయని క్షీరాన్నం నోట అరుచిగా అనిపింపజేసే దుర్వార్త అది.

రవి మేనత్త తీసుకువచ్చింది. ఆవిడ పూర్వ పచివాసివి. అతనింట్లోనే వుంటోంది.

"రవిబాబూ! మనకిక కూడులేదురా... ఆ ముదనష్టపోడు నీకు వేలువిడిచిన మేనమామ మోసం చేసి నీ ఆస్తంతా వశం చేసుకున్నాడురా — ఇవాళో, రేపో ఈ కొంపా — గోడూ అంతా కృష్ణార్పణం"

ఆవిడ వాక్ప్రవాహం ఆగదు... రవికి విషయం అర్థమైంది. మల్లెచెట్టు, వాగులో అందం చూసుకుందామని వంగి వరిగిపోయింది. నీటిలో కలిసిపోయిన ఆ దృశ్యం చూసి ఆకాశం హడిలిపోయింది.

"భయపడకు అత్తా! అన్యాయం గెలవదు. తప్పుగా సృష్టించిన పత్రాల విలువ అతి స్వల్పకాలమే..." రవి అన్నాడు ఆవిడను ఊరుకోబెడుతూ.

చెరువులో కలువల వంటి కన్నుల రూప కన్నులు నీలి నీడలైనప్పుడు, రవి అనుకోలేదు — మరో పెద్ద ఆపద తమకు రాబోతూందని.

చక్కగా, చుక్కల రాణిలా, కంఠమెత్తి హాయిగా పాడే రూప గొంతు గద్గదమయింది ఆరోజు.

యుగయుగాలనుండి చెప్పేమాటే — ప్రతి ప్రేమికుడూ ప్రేయసికి, ప్రేయసి ప్రియుడుకు.

వెచ్చటి కన్నీటికి పాషాణమే విరుగుతుంది. జలజలా రాలి మట్టిలో కలుస్తుంది.

పాషాణంలాంటి ఈ మాట కాలమంత శాశ్వతమైనది. ఇదివరకెందరో అన్నారు — ఇకముందంటారు.

ఇప్పుడు రూప రవితో అంది.

"నన్ను మరిచిపో —"

మ్రాన్పడిపోయాడు రవి.

"ఆర్మీలో మేజరట — నాకు నిశ్చయం చేశారు. నన్నెవరూ అడగలేదు. ఎందుకడుగుతారు. మరో పదిరోజుల్లో వెళ్లిపోతాను — అస్సాంలో ఎక్కడో"

తమ సంగతి పెద్దలకు తెలుసే! అయితే ఎందుకిలా?

ఆ పెద్దలకీ మరోటీ తెలిసే వుంటుంది. తానిప్పుడో నిర్భాగ్యుడు — నిరుపేద. అందుకేనా ఈ హఠాత్ పరిణామం...

చరిత్రలో మహారాజులే క్షణాల్లో నిరుపేదలైనారు. మహారాజు కావలసిన రాముడు, నిరుపేదగా పాదరక్షలు లేకుండా అడవికి వెళ్లవలసి వచ్చింది... అయితే విలువ తగ్గలేదే రాముడికి?... అది త్రేతాయుగం... యుగం మారింది — విలువలూ మారిపోయాయి.

చూస్తూండగా రోజులుగడిచిపోయాయి.

దూరంగా శ్రావ్యంగా సన్నాయిపాట. కర్ణకఠోరంగా బాజా భజంత్రీలు, శిలాక్షరాల లాంటి వేద మంత్రాలు... రూపని ఒక జన్మ దూరంలో నిలబెట్టే మంత్రాక్షరాలు.

మెటాడోర్‌లో ఎక్కుతూ కొత్త పెళ్లి కూతురు రూప చూసిన చూపు — ఆ వెదుకులాట — ఆ నిరీక్షణ... రవి కంటికి మసగ్గా కనిపించింది. మొగలిపువ్వు రంగు చీరలో, పసుపు మొత్తిన పసిమి ఛాయ శరీరంతో రూప.

కదిలిపోయింది రూప ఎక్కిన వాహనం — రవి గుండెల్లో శూన్యాన్ని మిగిల్చి.

రవి మాట ఆ రోజుతో ఆగిపోయింది. అసంకల్పితంగా శ్వాస ఆడుతున్నా, అందులో జీవంలేదు. శరీరం కదులుతున్నా అందులో చైతన్యం లేదు.

ఒక్కగానొక్క కొడుకుని చూసుకుని బతుకుతున్న రవి తల్లి శూలం గుచ్చిన కలువపువ్వే అయింది.

పగలూ, రాత్రీ, వెలుగు, చీకటీ, వేడీ, చలీ — ఏమీ లేని నిర్వికార స్థితిలో వున్న రవిని చూసి ఆమె ఏడ్చింది. భావమే లేని శబ్దంలా, రవిమీద ఆమె దుఃఖం పనిచేయలేదు.

ఆరిన కుంపటిలా, ముగ్గుబుట్టలాంటి తలా, ముడతలు పడ్డ శరీరం, కాంతిలేని గాజుకళ్లు — ఆమెకన్నా శవం నయం... ఏళ్లు ముదిరి, కీళ్లు కదిలి, బండరాయిలా పడివున్నా — బ్రతుకంటే కోర్కె సడలలేదు. "మరి ఇంత చిన్నవయసులో రవేమిటి ఇలా?" ఆమె ప్రశ్న.

అందరిలా తనకొడుకూ వుండాలి. ఆస్తి లేకుండా ఎంతమంది లేరు — ఆనందంగా వుండాలంటే ఆస్తే వుండాలా!

"ఇలా దిక్కుమొహం వేసుకు కూచుంటే ఎలా వదినా? ఓ పక్కన ఆ శాస్త్రుడు పెట్టిన కేసొకటి. ఇక్కడ మీరిద్దరూ ఇలా! రాత్రంతా కళ్లు వాచేట్టు ఏడిస్తే రవి మామూలు మనిషవుతాడా? రవి బదులు నేనే వెళ్లాను లాయరు దగ్గరకు — చదువురా

## కష్టం


"నీవు చూస్తుండగా... ఒకరు బావిలో పడ్డారనుకో! అప్పుడు నీవేం చేస్తావ్?" టీచర్ అడిగింది లక్ష్మిని.

"చూస్తూ కూర్చుంటాను సర్!"

"అదేమిటి!"

"మీరే అన్నారుగా! ఎవరికి వారే కష్టపడి పైకిరావాలని" గడుసుగా చెప్పింది లక్ష్మి.

-ఎం.ఆర్.శకుంతల (సికింద్రాబాద్)



ని ముండను — నాకేం తెలుస్తుందమ్మా! రూపను మరిచిపోతాడు — రవి — నే చేస్తాగా కొత్తల్లో ఇంతేనమ్మా — మా ఆయన పోయినప్పుడు చద్దామనుకున్నాను — కాలం గడిచింది. ఆ మహారాజు గుర్తులే గుండెలో దాచుకుని బండగా బతికెయ్యడంలేదూ''

రవి మేనత్త మాటలు కలలోలాగా వినపడుతోంది రవికి... రూపుదాల్చిన నీరవ విశ్శబ్దంలాంటి ఆ ఇంట్లో, ఆవిడ వునికే చైతన్యం —

ఎవ్వరికోసం ఆగదు కాలం... వానలు కురుస్తూ — ఆగుతూ — కురుస్తూ వున్నాయి.

ఉప్పొంగింది గోదారి... కొండల్లో కోన ల్లో కురిసిన వానతో చెలిమి చేసి, అడవి చెట్లతో పరాచకాలాడి — వాటి పూలు తెంపి తన తలలో తురుముకుని, వడివడిగా... సుడిసుడిగా పరవళ్లుతొక్కుతూ పారివచ్చిం ది.

వరజాతి గడగడా వణికింది. పూలు కుంకుమలతో పూజ చేసింది. శంఖాలు పూరించిన ఆనంద ఉగ్రరూపం, సిగ్గుతో ఎరుపెక్కింది. తెప్పున పొంగే తన ఆనంద ం — విషాదం మిగులుస్తోందని విడియపడ్డ గోదారి — ''చల్లగా వుండండి — నే వెళ్లిపోతున్నాను'' అని చెయ్యెత్తి దీవించి, కడలివైపు సాగిపోయింది.

అప్పుడు పట్టుకొచ్చింది రవి మేనత్త ఆ వార్త...

''అయ్యో! అయ్యో! ఎంతన్యాయం — ఎంతన్యాయం — దసరాకు వద్దామని పిల్ల బయలుదేరింది — కొత్త పెళ్లికూతురు — అన్యాయమైపోయింది.

రైలుదిగి పడవ ఎక్కింది... పడవ వడపమని ఆ వచ్చినాళ్లు చెప్పలేదు. ఒక్కతే ఎక్కింది. తల్లీ! గోదారీ!! ఎంత పనిచేసావ మ్మా — కోటిపల్లిలో పళ్లిచ్చాను. అప్పనపల్లి లో హారతిచ్చాను. వర్షాపురంలో దీపాలు వదిలాను. మా వూరి పిల్లమీద ఎందుకమ్మా కోపం? పెళ్లయి ఆర్నెల్లు కాలేదు — దేముడా—రూపమ్మతల్లీ— వెళ్లిపోయావా —

కొరడాతో కొట్టినట్టు ఉలిక్కిపడ్డాడు, తన గదిలో వంటరిగా కూర్చున్నరవి.

''రూపా... రూపా...'' గొంతెత్తి అరిచా డు కొన్ని నెలల తర్వాత రవి. అప్పుడే — ఆ వార్త విన్న రవి...

''రవీ — బాబూ — అంతా అయిపోయి ంది. శవం ఉబ్బిపోయింది. శవం ఉబ్బిపోయి ంది. రూపం లేదు — పడవ మునిగిపోయిన ఆరు మైళ్ల దూరంలో దొరికిందట — ఇక అక్కడేం లేదు — తీసుకెళ్లిపోయారు'' ఆమె అంది.

నెమ్మదిగా బయటకు వచ్చాడు. నది గట్టమ్మట నడిచాడు... మబ్బుల మసకలో దూరంగా గుప్పెడు జనం... ఎర్రటి, పచ్చటి మంటలు ఆకాశానికి ఎగస్తూ —

అక్కడే కూలబడ్డాడు రవి... కొంతసేప టికి.

''పడవండమ్మా... పొయ్యిలో నిప్పెయ్య లేదు. పిల్లలు గోలపెడుతుంటారా? రెండు మెతుకులు వాళ్లకు ఉడకేసి పెట్టాలి'' తడిబట్టల ఆడవాళ్లలో ఒకావిడ బిగ్గరగా అంటోంది...

చినుకు చినుకు వానలో ముందుకెళ్లాడు రవి.

ఏడుస్తూ, ఏళ్లకేళ్ల ప్రవహించే గోదారి

ఏడుస్తూనే వుంది!

ప్రతీ మూల వెతుకుతూ పరుగెడుతోంది. వెర్రిగాలి — రూప కోసమే.

దిక్కు మొహం వేసుకుని పారిపోతున్నాయి మేఘాలు.

"రూపా! ఏం అపరాధం చేశాను నేను. ప్రతీ శబ్దంలోనూ నీ కంఠమే విన్పించి, చీకట్లో ప్రతీ మూల నీ చేతులతో సృజించి, చీకట్లో తిరిగి నక్షత్రాల మాలగుచ్చి నా మెడలో వేసి, నా కంటిలో క్రీనీడవై, నా నిద్రలో కలవై, నా సుఖానికి స్పర్శవై, ఇప్పుడు గాలిలా వన్నూపి వెళ్లిపోతావా?

నేనూ వస్తాను — ఆగు — ఆగు"

□ ■ □

రవి ఉత్తరం వ్రాశాడు.

"అయ్యా!

మీరెవరో నాకు తెలియదు. మీ పేరు కూడా నాకు తెలియదు. నా రూపకి, ఆజన్మాంతం బాసటగా నిలుస్తానని వేదమంత్రాం సాక్షిగా ప్రమాణం చేశారు? ఏం చేశారు? అవున్లెండి — దీన్లో మీ తప్పేముంది.

రూపా — నేనూ — ఇద్దరికీ తప్ప లోకానికి కంటగింపు...

కాని...

ప్రేమికుల రంగులరాట్నంలో ఇరుసుల్లా చిత్రవధ అనుభవించేది ఆ ప్రేమికులే —

అమాయకంగా అరుగుతూ, తిరుగుతూ వుండే లోహగోళం — ప్రేమించినదాన్ని కరగ్రహణం చేసినవాడు — అత్యంత దయనీయమైన పాత్ర అతనిది — మా కథలో మీది నిజం చెప్పడం నా ధర్మం — మీకు.

ప్రతీ కథకీ ముగింపు వుంటుంది.

ముగింపుకుముందు మూడుమాటలు.

రూప పూజకు ఎన్నుకున్న పుష్పం మాత్రమే. పూజింపబడలేదు.

రూప ఆఘ్రాణించబడలేదు. సృజింపబడలేదు.

రూప శివుడి జటాజూటంమండి జాలు

## నిజం

*ఈ మధ్యన ఓ జర్నలిస్ట్ శత్రుఘ్నసిన్హాను "పోలీసులు అంతా అయిపోయిన తర్వాతే సినిమాల్లో ప్రత్యక్షమవుతారేమిటని" అడగగానే ఆయన "థాంక్‌గాడ్! నిజజీవితంలో అసలు రారుకదా" అన్నారట! నిజమేకదా — రాజకీయ నాయకుడైనా ఎలాటి నిజం చెప్పాడో చూడండి.*



— జూపిటర్

వారిన పవిత్ర గంగ!

రూప రూపం లేకపోయినా, ఆ పవిత్రత మీ గుండెకు చల్లదనాన్నిస్తుందని ఆశిస్తా —

— రవి.

రవి హృదయం ఆక్రోశిస్తూనే వుంది. "రూపా! నేను వస్తున్నా — ఈ ఉత్తరం పంపి — చిరునామా దొరకడంలేదు... ఇప్పుడు దొరికింది... వస్తున్నా"

□ ■ □

ఉదయాన్నే రవి మేనత్త ఆనందంగా అరుస్తూ వచ్చింది.

"బాబూ! మనం కేసు నెగ్గాం... ఆ పత్రాలు సరైనవి కావని, మన ఆస్తి మనకే చెందుతుందని ఆ జడ్జిబాబు చెప్పాడురా. మనకి మంచి రోజులొచ్చాయి. ఇక మా ముసలి బతుకులకేం కావాలిరా — నీ చేతులమీదుగా రాలిపోతే — నువ్వు పెళ్లి చేసుకుని పిల్లాపాపలతో..." ఆవిడ వాక్‌ప్రవాహిని ఆగిపోయింది.

టేబుల్‌మీద రెపరెపలాడుతూ రవి రాసిన ఉత్తరం...

"అమ్మా!

కంటికి కనిపించేదంతా లుప్తమైపోతుంది నశించేది మాత్రమే కనిపిస్తుంది. నువ్వూ — నేనూ అందరూ — ముందు వెనకల తేడాయే తప్ప మరేం లేదు. రూప నన్ను పిలుస్తోంది. కవుల కలాలు, గాయకుల కంఠాలు, సుందరీమణుల అందాల, పువ్వుల పరిమళాలు, అన్నీ నేలలో కలిసి, అణువులో అణువుగా మారినచోట... ఆ చోట — నా రూప మృత్తికాకణంతోపాటు నేనూ — ఇద్దరం ఏ కుమ్మరి సారెపైనో, కుండగా మారి ఒకటవుతాం — మళ్లీ జన్మెంతవరకూ నిరీక్షించలేకపోతే —"

ఆ ఉత్తరం చదివి ఆవిడ గొల్లుమంది. "హయ్యో — అయ్యో! ఇలా జరుగుతుందనుకోలేదు దేముడా. నా అబద్ధం ఇలా కొంప ముంచుతుందనుకోలేదు. పడవలో మునిగిపోయింది రూపకాదు — వాళ్ల బంధువు — ఇలా రూపని దూరం చేస్తే, మరిచిపోయి మనిషివవుతావనుకున్నాను. వదినా! వదినా! కొంపలంటుకున్నాయమ్మా. మన రవి ఏదో అఘాయిత్యం చేసేటట్టే వున్నాడు.

అన్నట్టు పండక్కి రూప వచ్చిందిగా... సంగతి చెప్పి రూపను తెస్తాను. ఏట్లో మునుగుతాడేమో! హరి దేముడా — మవ్వెళ్లమ్మా — రవిని ఆపు — రూపను చూపిస్తే ఆగుతాడు..."

రవి తల్లి ఆవిడ మాటలు విని నిర్ఘాంతపోయింది. గబగబా ఏటికి పరుగులెత్తింది. మనసు పరుగెడుతున్నా, శిథిలమైన శరీరం సహకరించడంలేదు.

□ ■ □

అగ్నిజ్వాలలను ఎన్ని మోసిందో చల్లని ఆ గోదారి... రవి శరీరం — మనసు — మరో వహ్నికణం — ఫర్వాలేదు. వేడికి ఇగిరిపోను — ఏళ్లకేళ్లు ఏడుస్తూ ప్రవహించే నేను — ఇగిరిపోయాను.

"తల్లీ — నా రూపని భస్మ రూపంలో నీలో కలుపుకున్నావు. నన్ను అలాగే కలుపుకో"

రవి మొలలోతు నీళ్లల్లో వున్నాడు. అతనికి హాయిగా వుంది. దూరంగా గట్టుమీద అరుపులు — ఏవో ఆకారాలు... నూనెలేని, వత్తిలేని దీపాన్ని వెలిగించాలని నీళ్ల ప్రయత్నం. నవ్వుకున్నాడు రవి.

"బాబూ! రూప బతికే వుందిరా — పాదు ముండని నేనే అబద్ధం చెప్పాను. నువ్వు అన్నీ మరిచిపోయి, అందరిలాగా పెళ్లి చేసుకుని పిల్లా పాపలతో వుంటావని... అయ్యో ఇలా బెడిసికొడుతుందనుకోలేదు. ఇదిగో వస్తోంది. రూప — చూడు — పరుగువ పరుగున ఎలా వస్తోందో?"

రవికి ఆవిడ మాటలు వినబడ్డాయి. ఏమిటి? రూప బతికే వుందా?

లీలగా గట్టుమీద ఒక ఆకారం...

చిలకాకు పచ్చ పట్టుచీరలో, రూప... కొంచెం లావయింది. విషాదం కళ్లల్లో కాపురమున్నా ముగ్గిన దొంక సంపంగిలా... నిజానికి ఆమె కళ్లు కనపడనంత దూరంలో వున్నాడు. చర్మచక్షువుకన్నా అంత చక్షువు చూపు చురుకు —

"రూపా... నే వస్తున్నా —"

రవి కాలు ముందుకువేశాడు.

"బాబూ! నీ కోరిక ప్రకారం రూప దగ్గరికేగా తీసుకెళ్లమన్నావు—" అని గోదారి తనలోకి లాక్కొంది.

"లేదు — లేదు — నేను వెళ్లాల్సింది గట్టుమీదకు. నీటిలోకి కాదు"

"ఆ సమయం దాటిపోయింది.... అన్నట్టు ఓ సుడి బలంగా రవిని చుట్టుకుంది.

"రవీ — రా — పైకి రా" రూప గొంతు చించుకుని అరిచింది.

సుడి బలంగా, తీవ్రంగా లాగింది రవిని... రవి కాళ్లకింద భూమి తప్పుకుంది.

"రూపా —" అన్న అరుపు — నీటి ప్రవాహంలో కలిసిపోయింది.

విశ్భ్రేష్టమై చూశాయి మూడు ఆకారాలు ... రవి తల్లీ, మేనత్త, రూప...

రూప నేలమీద పడిపోయింది.

గోదారి సుడి గిర్రున తిరిగి లోనికి పోయింది.

విధి విడదీసింది క్రూరంగా అప్పుడు!

సుడి విడదీసింది క్రూరాతిక్రూరంగా ఇప్పుడు!

□ ■ □

పూలబుట్ట పట్టుకుని పూజారిగారు 'పూజకోసం పూలు కోస్తున్నారు. తొందర పడ్డ ఓ పువ్వు ముందేరాలింది...

పూలబుట్టలో వుండాల్సిన పువ్వు, పాదాలకింద నలిగిపోయింది.

రేయి రాలిన పువ్వు —

□ ■ □

